ఎంపీఓ సస్పెన్షన్

చెన్నారావుపేట, డిసెంబర్ 16: చెన్నారావుపేట ఎంపీఓ శ్రీధర్‌రాజును కలెక్టర్ సత్యశారదాదేవి సోమవారం సస్పెండ్ చేశారు. ఇటీవల ఎంపీడీఓ శ్రీవాణిపై ఎంపీఓ అసభ్య పదజాలంతో దూషించిన విషయమై ఎంపీడీఓ జడ్పీ సీఈఓకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన అధికారుల నివేదిక ఆధారంగా కలెక్టర్ ఎంపీఓను సస్పెండ్ చేశారు.

సీపీని కలిసిన నల్లబెల్లి ఎస్సై

సుబేదారి, డిసెంబర్ 16: నల్లబెల్లి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన వీ గోవర్ధన్ సోమవారం పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝాను మర్యాదపూర్వంగా కలిశారు. హనుమకొండలోని ఆయన కార్యాలయంలో సీపీని కలిసి పూలమొక్క అందజేశారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

వర్ధన్నపేట, డిసెంబర్ 16: టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం దుకాణాలపై దాడి చేసి గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జీ బాబూలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని దుకాణాల్లో దాడులు చేసి మహ్మద్ బాబా కిరాణంలో రూ.7,620 విలువైన గుట్కాప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసుకుని వర్ధన్నపేట పోలీసులకు అప్పగించినట్టు తెలిపారు.

బహిరంగ విచారణకు హాజరుకావాలి

గిర్మాజీపేట, డిసెంబర్ 16: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్‌అక్తర్ హనుమకొండ కలెక్టరేట్ వద్ద ఈనెల 19న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు బహిరంగ విచారణ చేసేందుకు రానుంది. ఈమేరకు జిల్లాలోని ఎస్సీ కులాల నాయకులు హాజరై వినతిపత్రాలను అందజేయాలని కలెక్టర్ ఒక ప్రకటనలో కోరారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య


సంతోష్(ఫైల్)

నెక్కొండ, డిసెంబర్ 16: మనస్తాపంతో ఓ వ్యక్తి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని అప్పల్‌రావుపేటలో సోమవారం జరిగింది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మందపురు సంతోష్(30) భార్య కాపురానికి రావడంలేదని మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మనస్తాపం చెంది సోమవారం పురుగుల మందు తాగాడు. చికిత్సకోసం దవాఖానకు తరలించేలోపే మృతిచెందాడు. తల్లి మందపురి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తింపు కార్డులు ఇవ్వాలి

గిర్మాజీపేట, డిసెంబర్ 16: అర్హులైన కళాకారులకు కల్చరల్ గుర్తింపు కార్డులు జారీచేయాలని ప్రజానాట్యమండలి జిల్లా గౌరవ అధ్యక్షుడు గన్నారపు రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం రమేశ్ కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ సంధ్యారాణిని కలిసి వినతిపత్రం అందించారు. ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, చిన్నయాదగిరి, కుంట శాంతి, సుమలత, శ్రీలత, సాంబయ్య పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

*I, ADDIKILA MANASA D/o ADDIKILA SRINIVAS (New Name) previously called as VANGA MANASA W/o VANGA CHAITANYA KUMAR (Old Name) and Residing at H.No.1-1-47/4, Chaitanyapuri Colony, Opp. NIT, Hanumakonda Dist-506004, TG.

NTW-000

CHANGE OF NAME

*I, VANGA NAGAMANI W/o VANGA LAXMAIAH (New Name) Previously called as SWARGAM NAGAMANI D/o JAGANNATHAM (Old Name) H.No. 1-1-47/4, Chaitanyapuri Colony, Opp. NIT, Hanumakonda Dist-506004, T.G.

NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

మూడు చోట్ల సై.. రెండు చోట్ల నై

- నెక్కొండ మున్సిపాలిటీ ప్రతిపాదనపై గ్రామ సభల్లో ప్రజల స్పందన
- పలుచోట్ల నిరసన తెలిపిన గ్రామస్తులు

నెక్కొండ గ్రామసభలో చేతులు ఎత్తి ఆమోదం తెలుపుతున్న ప్రజలు

టేకులకుంట తండాలో ఘర్షణ పడుతున్న ప్రజలు

నెక్కొండ, డిసెంబర్ 16: నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసేందుకు అధికార యంత్రాంగం సోమవారం ఐదు గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించగా, మరో గ్రామ సభ రేపటికి వాయిదా పడింది. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని నెక్కొండ, నెక్కొండ తండా, పత్తిపాక, అమీన్‌పేట, టేకులకుంట తండాల్లో సోమవారం గ్రామసభలు నిర్వహించారు. వీటిలో నెక్కొండ మేజర్ గ్రామపంచాయతీ, నెక్కొండ తండా, పత్తిపాక గ్రామపంచాయతీల్లో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరై విలీనానికి అంగీకరిస్తూ ఏకగ్రీవ తీర్మాణాలు చేశారు. నెక్కొండలో ఎంపీడీవోతోపాటు తహసీల్దార్ రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సదానందం, సొసైటీ చైర్మన్ మారం రాము, మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, ప్రతినిధులు, ప్రజలు చేతులు ఎత్తి మద్దతు తెలిపారు.

టేకులకుంట తండా, అమీన్‌పేటల్లో నిరసనలు

టేకులకుంటతండాను గ్రామ పంచాయతీగా మార్చిన తర్వాత ఎంతో అభివృద్ధి చెందిందని, ఇప్పుడు నెక్కొండలో విలీనం చేస్తే అభివృద్ధి కుంటుపడుతుందని గ్రామ సభలో ప్రజలు నిరసన తెలిపారు. మున్సిపాలిటీగా మారితే అభివృద్ధి జరుగుతుందని ఎంపీడీవో సర్దిచెప్పినా ఫలితం లేకపోయింది. విలీనం చేయాలని కొందరు, చేయొద్దని మరికొందరు వాగ్వాదానికి దిగారు. చెన్నారావుపేట ఎస్సైతోపాటు పోలీసులు సముదాయించారు. మెజార్టీ ప్రజలు విలీనాన్ని వ్యతిరేకిస్తూ, మిగతా వారు సమర్థిస్తూ సంతకాలు చేశారు. దీంతో ఎంపీడీవో మరోసారి గ్రామసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అమీన్‌పేట గ్రామసభలోనూ నిరసన పెల్లుబికింది. ఈ గ్రామం నెక్కొండ మండలంలో ఉండగా పోలీసు, రెవెన్యూ విభాగాలు చెన్నారావుపేట మండలంలో ఉన్నాయని, దీంతో రెండు కిలోమీటర్ల దూరంలోని నెక్కొండను వదిలి చెన్నారావుపేటకు వెళ్తూ ఎన్నో కష్టాలు పడుతున్నామని తెలిపారు. గ్రామ చెరువు టేకులకుంట తండా పరిధిలోకి పోయిందని, చెరువుకు ఎస్సారెస్పీ నీరు చుక్కరాదని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో మున్సిపాలిటీలో కలుపుతామని ప్రతిపాదించడం విడ్డూరంగా ఉందన్నారు. ఒకరిద్దరు మినహా మిగతా వారంతా వ్యతిరేకించారు. ఈ క్రమంలో గొడవ చెలరేగింది. కాగా, గుండ్రపల్లిలో గ్రామ సభను మంగళవారానికి అధికారులు వాయిదా వేశారు.

గంట గడిస్తే ఇంటికి.. అంతలోనే మృత్యువు ఒడిలోకి..

- రైలు ఢీకొని పాయింట్స్‌మెన్ మృతి
- రెండో ప్లాట్‌ఫామ్‌కు గూడ్స్ రైలుకింది నుంచి దాటుతుండగా ప్రమాదం
- ఎల్గూర్ రైల్వేస్టేషన్‌లో అసంపూర్తిగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జి

రమేశ్ (ఫైల్)

సంగెం, డిసెంబర్ 16: గంట తర్వాత విధులు ముగించుకొని ఇంటి వెళ్లాల్సిన పాయింట్స్ మెన్ ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతిచెందాడు. ఈ ఘటన మండలంలో సోమవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎల్గూర్ రైల్వేస్టేషన్‌లో ఆరు లైన్లు ఉన్నాయి. ఇందులో రెండు మెయిన్ లైన్లు, నాలుగు లూప్‌లైన్లు. ఇక్కడ రెండు ప్లాట్‌ఫారాలు ఉన్నాయి. రెండో నంబర్ ప్లాట్ ఫామ్‌కు వెళ్లేందుకు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి సగం వరకు నిర్మించి మధ్యలోనే ఆపేశారు. ఇది పూర్తికాకపోవటంతో ప్రయాణికులు, రైల్వే ఉద్యోగులు రెండో నంబర్ ప్లాట్‌ఫామ్‌కు వెళ్లాలంటే ఆగి ఉన్న గూడ్స్ రైళ్ల కింది నుంచి దాటుతున్నారు. సోమవారం సాయంత్రం ఆరు లైన్లలో నాలుగు లూప్‌లైన్లలో గూడ్స్ రైళ్లు నిలిచి ఉన్నాయి. గూడ్స్ రైళ్ల కింది నుంచి వెళ్లి డౌన్‌లో స్టేబుల్‌లో ఉన్న గూడ్స్‌కు టెయిల్ ల్యాంపు వేయడానికి పాయింట్స్ మెన్ వెళ్లాల్సి ఉంటుంది. విధుల్లో ఉన్న పాయింట్స్ మెన్ రాచమల్ల రమేశ్(50) గూడ్స్ కింద నుంచి వెళ్తుండగా కాశీ – బనారస్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టగా అక్కడికక్కడే మృతిచెందాడు. గంట తర్వాత విధులు ముగించుకొని ఇంటికి వెళ్లేవాడు. అంతలోనే మృతిచెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడిది హసన్‌పర్తి మండలం వంగపహాడ్ కాగా, ప్రస్తుతం మండలంలోని గాంధీనగర్‌లో కిరాయి ఇంట్లో ఉంటూ విధులకు హాజరవుతున్నాడు.

కుక్కల దాడిలో వృద్ధుడికి గాయాలు.. గొర్రెలు మృతి

సంగెం : గాయాలైన వృద్ధుడు కొమురయ్య

సంగెం/నెక్కొండ, డిసెంబర్ 16: కుక్కల దాడిలో ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. సంగెం మండలం గవిచర్లకు చెందిన వృద్ధుడు పోశాల కొమురయ్య ఇంటి వద్ద ఉండగా కుక్కల గుంపు ఒక్కసారిగా దాడి చేసింది. దీంతో అతడి కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. దవాఖానకు తరలించగా చికిత్స పొందాడు. నెక్కొండ మండలం రెడ్లవాడలో సోమవారం గొర్రెల మందపై కుక్కలు దాడిచేయగా 15 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. దీంతో రూ.1.50లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు మేకలమేకల శ్రీనివాస్ తెలిపారు.

డివిజన్ అధ్యక్షుడికి నన్నపునేని సన్మానం

పవన్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్

గిర్మాజీపేట, డిసెంబర్ 16: బీఆర్ఎస్ పార్టీ వరంగల్ నగరం 19వ డివిజన్ అధ్యక్షుడు చిలువేరు పవన్ బర్త్ డే సందర్భంగా సోమవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌ను కలిశారు. ఈ సందర్భంగా పవన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేసి తినిపించారు. శాలువా కప్పి సన్మానించారు. 19వ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీపీఎం నుంచి సాగర్, రామస్వామి బహిష్కరణ

కరీమాబాద్, డిసెంబర్ 16: పార్టీ పేరుతో ఆర్థిక అవకతవకలకు పాల్పడుతూ పార్టీ నిర్ణయాలు, పార్టీ కార్యక్రమాలకు వ్యతిరేకంగా పని చేస్తున్న మాలోత్ సాగర్, ముక్కెర రామస్వామిని సీపీఎం నుంచి బహిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రంగయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పార్టీ నిర్ణయం మేరకు జిల్లా కమిటీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య

గిర్మాజీపేట, డిసెంబర్ 16: కుటుంబ తగాదాలతో మనస్తాపం చెంది రైలుకింద పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీస్ అధికారి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రానికి చెందిన వల్లెపు భీమరాజు(33) నగరంలోని కొత్తవాడలో నివసిస్తూ కూలీ పనిచేసేవాడు. భార్యాభర్తల గొడవలతో మనస్తాపం చెంది క్షణికావేశంలో వరంగల్–కాజీపేట రైల్వేస్టేషన్ల మధ్య శాయంపేట రైల్వేగేట్ సమీపంలో గుర్తుతెలియని రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులకు సమాచారం అందించి పంచనామా తర్వాత మృతదేహాన్ని తండ్రి ఐలయ్యకు అప్పగించినట్లు రైల్వే అధికారి తెలిపారు.

పేలుడు పదార్థాలు స్వాధీనం

గిర్మాజీపేట, డిసెంబర్ 16: అక్రమంగా నిల్వ చేసిన పేలుడు పదార్థాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఉర్సుగుట్ట బీరన్నకుంటలో నివసిస్తున్న శివరాత్రి అనిత ఇంట్లో అక్రమంగా పేలుడు పదార్థాలను ఉన్నాయనే సమాచారంతో దాడి చేశారు. జిలెటిన్ స్టిక్స్–74, డిటోనేటర్స్–100, ఫ్యూజ్‌లు–53 స్వాధీనం చేసుకొని, నిందితురాలిని అదుపులోకి తీసుకొని విచారణ కోసం మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు ఏసీపీ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు, ఆర్ఎస్ఐ భానుప్రకాశ్, మిల్స్‌కాలనీ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

నల్లబెల్లి, డిసెంబర్ 16 : పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను విద్యార్థికి ఎస్సై గోవర్ధన్ అప్పగించారు. ములుగు జిల్లా ఏటూర్‌నాగారానికి చెందిన విద్యార్థిని బట్ట ప్రశాంత నవంబర్ 22న మండలంలోని రేలకుంటలో సెల్‌ఫోన్ పోగొట్టుకుంది. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. టెక్నాలజీతో గుర్తించిన పోలీసులు సెల్‌ఫోన్‌ను విద్యార్థికి అందజేశారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి

గీసుగొండ, డిసెంబర్ 16: మహిళలు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని, సర్వోదయ సంస్థ తోడుగా ఉంటుందని శిక్షణ మేనేజర్ కూసం రాజమౌళి అన్నారు. మండలంలోని గంగదేవిపల్లిలో సోమవారం ఆ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఆర్థిక ఎదుగుదల, చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆడ మగ తేడా లేకుండా సమాజంలో ప్రజలంతా సమానంగా బతకాలన్నారు. మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కోఆర్డినేటర్ ఇందిర, సభ్యులు అక్తర్‌పాషా, కవిత పాల్గొన్నారు.

చౌటపెల్లిలో పోలీస్ కళాజాత

పర్వతగిరి, డిసెంబర్ 16: మండలంలోని చౌటపల్లిలో సోమవారం రాత్రి పోలీస్ కళాజాత నిర్వహించారు. కొత్త చట్టాలు, యువత గంజాయి, డ్రగ్స్, గుట్కా, మత్తు పదార్థాల బారిన పడొద్దని అవగాహన కల్పించారు. పర్వతగిరి సీఐ రాజగోపాల్ మాట్లాడారు. ఏఎస్ఐ రవీందర్‌రెడ్డి, కళాజాత బృందం సభ్యులు నాగమణి, విలియమ్స్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, నారాయణ, విక్రమ్ రాజు, చిరంజీవి, పోలీసు సిబ్బంది, రాజు, బాబురావు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

గిర్మాజీపేట, డిసెంబర్ 16: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మేకల రవి డిమాండ్ చేశారు. శివనగర్‌లోని తమ్మెరభవన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ పైడిపల్లి శివారు ఎస్సారెస్పీ భూముల్లో సర్వే నంబర్ 791, 782, 786, 355, 357, 298లలో మూడేళ్ల క్రితం నిరుపేదలు వేసుకున్న గుడిసెలు తొలగించడం సరికాదన్నారు. జిల్లా సహాయ కార్యదర్శులు షేక్‌బాషామియా, దండు లక్ష్మణ్ పాల్గొన్నారు.

రేపు టెన్త్ విద్యార్థులకు పరీక్షలపై అవగాహన

సమావేశంలో మాట్లాడుతున్న బొల్లం కనకయ్య

కాశీబుగ్గ, డిసెంబర్ 16: ఎస్ఎస్‌సీ పరీక్షలపై విద్యార్థులకు ఈనెల 18న ఉర్సుగుట్టలోని నానీ గార్డెన్స్‌లో ఉచితంగా అవగాహన కల్పించనున్నట్లు వడుప్సా వరంగల్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు బొల్లం కనకయ్య, జన్ను విలియమ్స్ తెలిపారు. సోమవారం నగరంలో వడుప్సా వరంగల్ డివిజన్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అనుభవం ఉన్న సబ్జెక్టు నిపుణులతో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు సూచనలు చేయనున్నట్లు పేర్కొన్నారు. వరంగల్ పరిధిలోని పాఠశాలల యజమాన్యాలు, పదో తరగతి విద్యార్థులు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. చీఫ్ అడ్వైజర్ సుధాకర్, యాదా విద్యాసాగర్, వైస్ ప్రెసిడెంట్ సింగారపు రాజు, జాయింట్ సెక్రటరీ ఎండీ నసీరుద్దీన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ ఉస్మాన్‌అలీ, రేపల్లి అశోక్‌కుమార్, రంగు మాధవి, ఎండీ ఖలీల్, మనుపురి వెంకటేశ్వరరెడ్డి, ఈసీ సభ్యులు సమీర్, ఇనాయత్, తల్లడ వెంకటేశ్వర్లు, శశిధర్‌రెడ్డి, ఆడెపు రాజేందర్, గౌస్, మురళి, అవినాష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నుంచి ఆలయాన్ని రక్షించాలి

మాట్లాడుతున్న ప్రధానార్చకుడు శ్రీనివాసస్వామి

వరంగల్ చౌరస్తా, డిసెంబర్ 16: కాంగ్రెస్ నాయకుల నుంచి గోవిందరాజస్వామి ఆలయానికి రక్షణ కల్పించాలని అనువంశీయ అర్చకుడు, ఆలయ ప్రధానార్చకులు వరయోగుల శ్రీనివాస స్వామి కోరారు. సోమవారం ఆలయ ఆవరణలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయం ఆవరణలో రాజకీయాలు, సెటిల్‌మెంట్‌లు చేస్తూ ఆలయాన్ని భ్రష్టు పట్టిస్తున్న స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్, ఆయన సోదరుడు చింతాకుల సునిల్‌కుమార్‌ను నిలువరించేందుకు ప్రయత్నించగా తమపై దాడులు చేయడంతోపాటు ఆలయంలో పూజలు చేయకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. అదనపు అర్చకుల నియామకం కోసం మంత్రి కొండా సురేఖను కలిసి విన్నవించగా నేరుగా మంత్రిని కలిసి ఫిర్యాదు చేస్తారా? అంటూ కాలభైరవ ఉప ఆలయంలో అర్చకుడిపై దాడికి పాల్పడిన విషయం తెలిసిందేనన్నారు. మంత్రితోపాటు దేవాదాయ శాఖ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

మెయిన్ రోడ్డుపై అంగడితో ట్రాఫిక్ జామ్

నల్లబెల్లిలో రోడ్డుపైనే కొనసాగుతున్న అంగడి

నల్లబెల్లి, డిసెంబర్ 16: మండల కేంద్రంలో మెయిన్ రోడ్డుపై అంగడి కొనసాగుతుండగా ప్రజలు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రతి సోమవారం రోడ్డుకు ఇరువైపులా వ్యాపారులు కూర్చొని అమ్మకాలు చేస్తుండగా కొనుగోలుదారులతో రద్దీ ఉంటుంది. ఇరుకుగా మారిన పరిస్థితుల్లో భారీ వాహనాలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెళ్తుంటాయి. మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల కోసం అనేక మంది వచ్చి వెళ్తుంటారు. ఇక్కడే ఏపీజీవీబీకి పార్కింగ్ లేకపోవడంతో ఖాతాదారుల బైక్‌ల వల్ల రోడ్డు పూర్తిగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీంతో అంగడిలోతరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు, మాజీ ప్రజాప్రతిధులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు చర్యలు చేపట్టి అంగడిని మెయిన్‌రోడ్డు పైనుంచి మరో చోటకు మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

వసతి గృహ సంక్షేమ అధికారుల సమస్యలను పరిష్కరించాలి

గిర్మాజీపేట, డిసెంబర్ 16: వసతి గృహ సంక్షేమ అధికారుల సమస్యలను పరిష్కరించాలని టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రాంకిషన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన యూనియన్ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ సత్యశారదను కలిసి వినతిప్రతం అందించారు. కార్యదర్శి వేణుగోపాల్, గద్దల రాజు, యూసుఫ్, గణేశ్, తెలంగాణ వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం జిల్లా కార్యదర్శి రవికుమార్, రాజయ్య, జోసఫ్, అర్జున్, కృష్ణవేణి, ముజాహిద్, రాధిక, రేఖ, మంజుల, స్నేహలత, హరిత, విద్యారాణి, భాస్కర్, నరేంద్రనాథ్ పాల్గొన్నారు.

రూ.50వేలు అందజేత

చెక్కును ఇస్తున్న లక్ష్మీనారాయణ, గీత దంపతులు

గీసుగొండ, డిసెంబర్ 16: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జనవరి 8 నుంచి 11 వరకు జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల నిర్వహణకు గ్రామానికి చెందిన బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ లక్ష్మీనారాయణ, గీత దంపతులు సోమవారం రూ.50వేల ఆర్థికసాయం అందించారు. ఖోఖో పోటీల్లో పాల్గొనేందుకు వచ్చే విద్యార్థులకు భోజనం, టిఫిన్స్, ఇతర అవసరాల కోసం ఈ విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు. టోర్నమెంట్ నిర్వహణకు విరాళాలను సేకరిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కార్యదర్శి రాంబాబు తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి వీరగోని స్వప్న, సలహాదారు రామ్మూర్తి పాల్గొన్నారు.

గొల్ల కురుమల సమస్యల పరిష్కరించాలి

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జీఎంపీఎస్ సభ్యులు

నెక్కొండ, డిసెంబర్ 16: గొల్ల కురుమల సమస్యలపై ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి పరిష్కరించాలని జీఎంపీఎస్ మండల అధ్యక్షుడు సక్క రవి డిమాండ్ చేశారు. గొల్ల కురుమల హక్కుల సాధన కోసం ఈనెల 19న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సోమవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో గొల్లకురుమలకు రూ.2లక్షల నగదు బదిలీ చేస్తామని హామీ ఇచ్చి మరిచి పోయారన్నారు. గొల్ల కురుమల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కుక్కల దాడి, ఇతర కారణాలతో చనిపోయిన గొర్రెలకు ఇన్సూరెన్స్‌తో సంబంధం లేకుండా ప్రభుత్వమే నష్టపరిహారం చెల్లించాలన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేత

పర్వతగిరి, డిసెంబర్ 16: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు రూ.30వేల విలువైన స్కూల్ బ్యాగులను అప్పలరావు పేట ఉపాధ్యాయురాలు శోభారాణి ఆధ్వర్యంలో ఎంఈఓ లింగారెడ్డి చేతులమీదుగా అందించారు. బూరుగుమళ్ల పాఠశాలలో చందా శోభారాణి, రమేశ్, రాహుల్ ఆధ్వర్యంలో 64 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఎంఈఓ గాయపు లింగారెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ పాక రమేశ్‌బాబు, ప్రధానోపాధ్యాయులు వెంకటరమణారెడ్డి, లలితాదేవి, సుభాషిణి, రామస్వామి, నవీన్, ప్రసాద్, కిషన్, శ్రీనివాస్, టీచర్లు రమాదేవి, జగదీష్, కల్యాణి, మధుసూదన్ పాల్గొన్నారు.

దళితబంధు నిధులు విడుదల చేయాలి

అరెస్ట్ అయిన దళితబంధు సమితి నాయకులు

గీసుగొండ, డిసెంబర్ 16: బీఆర్ఎస్ ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిన దళితబంధు డబ్బులను కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయాలని దళిత బంధు సాధన సమితి అధ్యక్షుడు కోట ప్రమోద్ డిమాండ్ చేశారు. ఆదివారం అర్ధరాత్రి స్థానిక పోలీసులు దళితులను అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడంపై మండిపడ్డారు. ఖాతాలను కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఫ్రీజ్ చేయడంతో దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కేసీఆర్ రాష్ట్రంలో దళితుల కళ్లలో ఆనందం చూశారని గుర్తుచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరవకుశంగా పాలన సాగిస్తోందన్నారు. అరెస్ట్ అయిన వారిలో నమిండ్ల రాజు, కేదాసి ఐలయ్య, రాజేందర్, అన్వేష్ ఉన్నారు.

'మోదీ వైఖరి నశించాలి'

గిర్మాజీపేట, డిసెంబర్ 16: దేశ సంపదను పెట్టుబడిదారులకు దోచిపెడుతున్న మోదీ ప్రభుత్వ వైఖరి నశించాలని ఎంసీపీఐ(యూ), ఎంసీపీఐ(యూ) ప్రతినిధులు కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో మెజారిటీ తగ్గించినా మోదీ బుద్ధి మారలేదని ఎద్దేవా చేశారు. పాలకుల దోపిడీ విధానాలను నిరసిస్తూ కార్మిక హక్కుల సాధన కోసం సమరశీల ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఏఐసీటీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నర్ర ప్రతాప్, జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, మహమ్మద్ మసూక్ పాల్గొన్నారు.

సీకేఎం హాస్పిటల్ తనిఖీ చేసిన కలెక్టర్

- శానిటేషన్‌పై అసంతృప్తి, అడ్మినిస్ట్రేషన్ అధికారిపై ఆగ్రహం
- ఎలుకల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు

హాస్పిటల్‌లో వంటగదిని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ చౌరస్తా, డిసెంబర్ 16: వరంగల్ సీకేఎం హాస్పిటల్‌ను కలెక్టర్ సత్యశారద ఆకస్మిక తనిఖ